

కియా ఇండియా సంస్థలో శిక్షణ, ఉద్యోగావకాశాలు

జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంటా సుధాకర్

ప్రజాశక్తి - ఏలూరు

ఏపి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన డిప్లమా, బిటెక్ చదివిన అభ్యర్థులకు కియా ఇండియా సంస్థలో శిక్షణ, ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంటా సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. 2019-24లో డిప్లమా, బిటెక్ ఉత్తీర్ణత సాధించిన 18-25 ఏళ్లలోపు వయస్సు గలవారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.15,500 ఉపకార వేతనం ఉంటుందని తెలిపారు. అనంతపురం జిల్లా పెనుకొండలోని కియా ఇండియాలో ఐదు రోజులు శిక్షణ పొందిన అనంతరం ప్రొబేషనలీగా పని చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు కియా ప్రాజెక్టు కోఆర్డినేటర్‌ను 7658902296కు ఫోన్ చేసి సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

సంచుల రగడ..!

రబీ ధాన్యం కొనుగోలులో సంచుల కొరతతో రైతులే సొంతంగా ఏర్పాటు

గోనెసంచులు రైతులకు తిరిగివ్వని పౌరసరఫరాల శాఖ

రెండు జిల్లాల్లో 387 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

ప్రతి కేంద్రంలో 3 వేలకుపైగా సంచులు పెండింగ్

ఆర్‌బికెల చుట్టూ అన్నదాతల ప్రదక్షిణలు

సంచికి రూ.20 వరకూ నష్టపోతున్న రైతులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి



రబీ ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యి నెలలు గడుస్తున్నా రైతులకు ఇవ్వాల్సిన సంచులు ఇవ్వకుండా పౌరసరఫరాల శాఖ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుండటంపై అన్నదాతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండు జిల్లాల్లో ఏర్పాటు చేసిన అన్ని కొనుగోలు కేంద్రాల్లోనూ సంచుల సమస్య నెలకొంది. రబీ సీజన్‌లో రెండు జిల్లాలవ్యాప్తంగా దాదాపు మూడు లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో 7.20 లక్షల టన్నులు, ఏలూరు జిల్లాలో 2.40 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. అందుకు తగినట్లుగా పశ్చిమలో 269 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 6.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం, ఏలూరు జిల్లాలో 120 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రెండు లక్షల 1610 టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ధాన్యం కొనుగోలు సమయంలో గోనె సంచుల కొరత లేదంటూ అధికారులు తెగ ఊదరగొట్టారు. తీరా ధాన్యం విక్రయించేందుకు రైతులు ఆర్‌బికెలకు వచ్చేసరికి సంచులు సకాలంలో అందించలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతులు సొంతంగా సంచులు ఏర్పాటు చేసుకుంటే తర్వాత తాము తిరిగిస్తామంటూ పౌరసరఫరాల శాఖాధికారులు తెలిపారు. దీంతో చాలామంది రైతులు సొంతంగా గోనె సంచులు ఏర్పాటు చేసుకుని ధాన్యం విక్రయించిన పరిస్థితి కొనసాగింది. అందుకు సంబంధించి ఆర్‌బికెల్లో తాము సొంతంగా సంచులు ఏర్పాటు చేసుకున్న ట్లు రైతులు నమోదు చేసుకున్నారు. ఆర్‌బికెల్లో ధాన్యం అమ్మిన రైతులకు సంబంధించి నమోదు చేసే ఆన్‌లైన్‌లో సంచుల కాలమ్ వద్ద మిల్లర్ల నుంచి సంచులు వస్తే మిల్లరు అని, రైతులు ఏర్పాటు చేసుకుంటే రైతు అంటూ ఆర్‌బికెల్లో నమోదు చేశారు. ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత రెండు, మూడు రోజుల్లో రైతులకు తిరిగి సంచులు ఇవ్వాల్సి ఉంది. రైతులు ధాన్యం విక్రయించి నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకూ రైతులకు గోనె సంచులు అందించలేదు. దీంతో రైతులు ఆర్‌బికె, సహకార సంఘాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. పౌర సరఫరాల శాఖ చినిగిపోయి, ఎందుకూ పనికిరాని సంచులు పంపి తీసుకోవాలని చెప్పడంపై రైతులు మండిపడుతున్నారు. చాలామంది మంది రైతులు ధాన్యం వ్యాపారుల వద్ద సంచులు తీసుకొచ్చి విక్రయించారు. ఇప్పుడు అధికారులు సంచులు ఇవ్వకపోవడంతో ఒక్కో సంచికి రూ.20 చొప్పున రైతుల నుంచి వసూలు చేస్తున్నారు. దీంతో వంద సంచులు తెస్తే రూ.రెండు వేలు, 200 సంచులు తెస్తే రూ.నాలుగు వేలు ఇంకా ఎక్కువ తెస్తే పెద్దఎత్తున డబ్బు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతుండటంతో లబోదిబోమంటున్నారు. నాణ్యమైన సంచులు ఇవ్వకుండా పౌరసరఫరాల శాఖ తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శి స్తుందని రైతులు మండి పడుతున్నారు. ప్రతి కొనుగోలు కేంద్రం లోనూ మూడు వేలకుపైగా సంచులు రైతులకు ఇవ్వాల్సి ఉందని తెలుస్తోంది. కొన్ని కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎనిమిది వేలకు పైగా సంచులు ఇవ్వాల్సి ఉండటం గమనార్హం. సంచుల కోసం రైతులు ఆర్‌బికె, సహకార సంఘాల అధికారులతో వాగ్వాదానికి దిగుతున్న పరిస్థితి ఉంది. దీంతో కిందిస్థాయి అధికారులకు ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. రైతులకు ఇవ్వాల్సిన సంచులు వెంటనే పౌరసరఫరాలశాఖ ఇవ్వాలని అంతా కోరుతున్నారు. సంచుల సమస్యపై జిల్లా కలెక్టర్లు దృష్టి సారిస్తే తప్ప పరిష్కారమయ్యేలా కన్పించడం లేదు.

నిత్యావసరాల ధరలు నియంత్రణకు చర్యలు

జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి

ప్రజాశక్తి - ఏలూరు

వివిధ నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నామని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. పౌర సరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం జిల్లా పౌరసరఫరాల అధికారి, జిల్లాలోని రైస్‌మిల్లర్స్, హోల్‌సేల్ బియ్యం, పప్పుదినుసుల, పంచదార వర్తకుల యాజమాన్యంతో జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. బహిరంగ మార్కెట్ కంటే బియ్యం, కందిపప్పు, పంచదార అన్నీ కూడా చౌక ధరలతో ప్రజలకు అందుబాటులో ఉంచాలని జెసి కోరారు. గతంలో ఇలాంటి సమస్య వచ్చినప్పుడు రైతుబజార్లలో ప్రజలకు అందుబాటులో సూపర్ ఫైన్ వెరైటీ బియ్యం, కందిపప్పు కౌంటర్లను ప్రారంభించి ధరలు నియంత్రించేవారని వర్తకులకు ఆమె గుర్తు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతిరోజూ పరిస్థితిని సమీక్షించి తదుపరి కార్యాచరణ చేపడతామన్నారు. పప్పులు, పంచదార మహారాష్ట్ర, ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి రావడంతో మార్కెట్ రేటు మన చేతిలో ఉండదని వర్తకులు తెలిపారు. బియ్యం ఈ జిల్లాలో ఫైన్, సూపర్ ఫైన్ మాత్రమే వినియోగిస్తున్నారని, జిల్లాలో రైతులు ఈ సన్న రకాలు పండించకపోవడంతో పక్క జిల్లాల నుండి దిగుమతి చేసుకోవాల్సి వస్తుందని చెప్పారు. దీనిపై జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి మాట్లాడుతూ ధరలను నియంత్రించడానికి సూచనలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి ఎస్-ఎస్.సత్యనారాయణరాజు, ఎఎస్‌ఒ వై.ప్రతాపరెడ్డి, వర్తక సంఘ ప్రతినిధులు నేరెళ్ల రాజేంద్ర, మద్దుల కుమార్, కెవి.సుబ్బారావు, సురేష్ పాల్గొన్నారు.

ప్రత్యేక హోదాపై నోరు మెదపరేమీ

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - భీమవరం టౌన్


రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని అడిగే అవకాశమున్నా ఎందుకు జంకుతున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్యమంత్రి చంద్రబాబును సూటిగా ప్రశ్నించారు. శనివారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో సిపిఎం జిల్లా విస్తృత సమావేశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన బిజెపి ప్రభుత్వానికి ఈ ఎన్నికల్లో ప్రజలు గట్టి బుద్ధి చెప్పారన్నారు. మిత్రుల సహకారంతో మాత్రమే మోడీ అధికారంలోకి వచ్చారని గుర్తించాలన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీల సహకారంతోనే మోడీ పాలన సాగుతుందని తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఇంకెప్పుడు అడుగుతారని ప్రశ్నిం చారు. గత ముఖ్యమంత్రిలా లొంగుబాటు తత్వంతో కాకుండా, పోరాటతత్వంతో రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా మాత్రమే కాకుండా అభివీద్ధికి కీలకమైన ప్రత్యేక హోదాపైనా అడగాలన్నారు. రాష్ట్రానికి ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి ఉన్నారని, అయినా విశాఖ ఉక్కును ప్రయివేటుపరం కానీయబోమని అటు బిజెపి, ఇటు తెలుగుదేశం కూటమి ప్రభుత్వం చెప్పడానికి సిద్ధపడటం లేదని ఎద్దేవా చేశారు. పోలవరం డ్యామ్‌తోపాటు ముంపు ప్రాంతాల ప్రజలకు పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ రాష్ట్రంలో రోజురోజుకీ నిత్యావసర ధరలు తగ్గుతున్నా అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ జిల్లాలో తక్షణం దెబ్బతిన్న రోడ్లు నిర్మించాలన్నారు. రైతులకు ధాన్యం బకాయిలు తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి దళితపేటకూ రెండెకరాల భూమిని శ్మశాన వాటికకు కేటాయించాలన్నారు. ఈ సమా వేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, బి.వాసుదేవరావు, డి.కల్యాణి, కర్రి నాగేశ్వరరావు, పివి.ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్ పోరాట పటిమ యువతకు ఆదర్శం

వర్ధంతి కార్యక్రమంలో ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ


బాబూ జగ్జీవన్‌రామ్ పోరాట పటిమ నేటి యువతకు ఆదర్శప్రాయమని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి అన్నారు. భారత మాజీ ఉపప్రధాని, డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ 38వ వర్ధంతి కార్యక్రమం ఏలూరులోని జ్యూట్‌మిల్లు వంతెన సమీపంలో ఉన్న ఆయన విగ్రహం వద్ద శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి చిన్న వయస్సులోనే మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఘనత బాబూ జగ్జీవన్‌రామ్‌కే దక్కుతుందన్నారు. దళితుల హక్కుల కోసం ఎనలేని కృషి చేశారని, ఆయన పోరాట పటిమ నేటి యువతకు ఆదర్శప్రాయమని చెప్పారు. క్విట్ ఇండియా ఉద్యమంలో కూడా ఆయన చూపిన పోరాట స్ఫూర్తి ప్రజా హృదయాల్లో నిలిచిపోయిందన్నారు. ఆయన ఆశయాలను ప్రతిఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు పార్లమెంట్ టిడిపి క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు జుంజు మోజెస్, నాయకులు కందుల రమేష్, మున్నుల జాన్ గురునాథ్, మేతర అజయ్‌బాబు, డోమినిక్, ఈతకోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ బడేటి చంటి

క్రమేపీ పెరుగుతున్న గోదావరి వరద

ప్రజాశక్తి - పోలవరం



స్పిల్ వే వద్ద పెరుడుతున్న గోదావరి వరద

గోదావరి పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతోంది. గోదావరి ఉప నదులు శబరి, మంజీర, ప్రాణహిత, ప్రవర పర్ణ నదుల జలాలు ఉప్పొంగి గోదావరిలో కలుస్తుండటంతో గోదావరి నీటిమట్టం పెరుగుతూ వస్తోంది. ప్రాజెక్టులోకి వస్తున్న గోదావరి జలాలను ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 26.470 మీటర్లు, స్పిల్‌వే దిగువన 16.480 మీటర్లు, ఎగువ కాపర్ డ్యామ్ ఎగువన 26.520 మీటర్లు, దిగువ కాపర్ డ్యామ్ దిగువన 15.340 మీటర్ల నీటిమట్టం నమోదైనట్లు పోలవరం ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు పి.వెంకటరమణ, మల్లికార్జునరావు తెలిపారు.

పట్టిసీమ నుండి 6,018 క్యూసెక్కుల నీరు విడుదల

పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుండి 6,018 క్యూసెక్కుల గోదావరి వరద జలాలను దిగువకు విడుదల చేసినట్లు పట్టిసీమ ఎత్తిపోతల పథకం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పెద్దిరాజు తెలిపారు. శనివారం పట్టిసీమలో గోదావరి నీటిమట్టం 14.750 మీటర్లకు చేరుకుందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 17 పంపులు, 17 మోటార్ల ద్వారా నీటిని పోలవరం కాల్వకు మళ్లిస్తున్నట్లు తెలిపారు.

ఏలూరులో అన్నపూర్ణ అథెంటిక్ హోటల్ ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ



హోటల్ ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ చంటి, రోషన్‌కుమార్

నగరంలోని నరసింహరావు పేటలో అన్నపూర్ణ అథెంటిక్ హోటల్‌ను ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి, చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ శనివారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యాపార రంగంలో హోటల్ వ్యాపారం విస్తారంగా వ్యాపిస్తుందన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే మార్గాల్లో హోటల్ వ్యాపారం ఒకటని తెలిపారు. వ్యాపార భాగస్వాములైన రాము, సాయి, గణేష్, నాని అభ్యున్నతి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హోటల్ యాజమాన్యం, కుటుంబసభ్యులు, టిడిపి, జనసేన, వైసిపి కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి

ప్రజాశక్తి - ముదినేపల్లి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

యువత చదువులో ముందు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలంటూ ముదినేపల్లి మండల వ్యాప్తంగా యువతను మేల్కొలిపే విధంగా అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి వినూత్న కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. మండలంలోని వడాలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. వాడవాడలా యువతను మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలనే నినాదంతో ర్యాలీ ముందుకు సాగింది. ఈ కార్యక్రమంలో వైష్ణవి తండ్రి డాక్టర్ మనోజ్, ప్రధానోపాధ్యాయులు ప్రభుదాస్, జిలానీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఎరువులు, పురుగుమందులు అందించాలి

పలుచోట్ల దుకాణాలపై విజిలెన్స్, వ్యవసాయ శాఖ దాడులు

ప్రజాశక్తి - ఉంగుటూరు



ఉంగుటూరులో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్, వ్యవసాయాధికారులు

మండలంలోని గొల్లగూడెంలో గోద్రెజ్ ఆగ్రో వెట్ లిమిటెడ్‌కు చెందిన గోదాములో అనుమతులు లేని రూ.31.15 లక్షల ఎరువులను విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. పురుగుమందులు, ఎరువులు, విత్తనాలు అమ్మే అన్ని దుకాణాలు, అవుట్ లెట్స్‌లను రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు చేయాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో శనివారం గుంటూరు సిఎస్‌డిఎ ఎడిఎ విజయప్రసాద్, ఏలూరు జిల్లా విజిలెన్స్ సిఐ విల్సన్ ఆధ్వర్యంలో భీమడోలు ఎడిఎ, ఉంగుటూరు ఎఒ స్వాడ్ బృందం గొల్లగూడెంలో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ అవుట్‌లెట్‌లో డిఎపి, యూరియా, మెగ్నీషియం, ఎన్‌ఒపి, సల్ఫర్ రెండు వేల బస్తాల స్టాకు అదనంగా ఉందని, వీటి విలువ రూ.31.15 లక్షలుగా నిర్ధారించామని భీమడోలు ఎడిఎ పి.ఉషారాజకుమారి తెలిపారు. ఎరువులు అమ్మేందుకు ఒ-ఫామ్ అనుమతులు ఉండాలని, అవేమి లేకుండా అప్పటికే రూ.3.15 లక్షల విలువైన ఎరువులు, ఇతర వ్యవసాయ మందులు అమ్మకాలు జరిగాయని గుర్తించారు. అంతే కాకుండా అనుమతులు లేని కంపెనీలకు చెందిన స్టాకు ఉన్నట్లు తనిఖీల్లో గుర్తించారు. ఈ క్రమంలో ఎరువుల నియంత్రణ చట్టం కింద కేసు నమోదు చేసి సంబంధిత రికార్డులను స్వాధీనం చేసుకున్నామని అధికారులు వెల్లడించారు. మండల వ్యవసాయాధికారి బాలిన వెంకటేష్, గొల్లగూడెం విఆర్‌ఒ చంద్రబాబు పాల్గొన్నారు.

భీమడోలు :మండలంలోని ఎరువుల దుకాణాలపై వ్యవసాయ శాఖ, ఏలూరు జిల్లా విజిలెన్స్ శాఖాధికారులు శనివారం సాయంత్రం సంయుక్తంగా ఆకస్మిక దాడులు చేశారు. ఈ సందర్భంగా లెక్కలు సక్రమంగా లేని రూ.5.12 లక్షల విలువైన ఎరువుల అమ్మకాలను నిలిపివేశారు. వ్యవసాయ శాఖ అంతర్ జిల్లాల స్థాయిలో చేపట్టిన తనిఖీల్లో భాగంగా వ్యవసాయ శాఖ భీమునిపట్టణం సహాయ సంచాలకులు బి.విజయప్రసాద్, విజిలెన్స్ శాఖ ఏలూరు సిఐ విల్సన్ భీమడోలులోని మన గ్రోమోర్ ఎరువుల విక్రయ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారి గోదాముల్లో నిల్వ ఉన్న ఎరువుల లెక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయని, సక్రమంగా లెక్కలు లేని రూ.5.21 లక్షల విలువైన 187.80 మెట్రిక్ టన్నుల ఎరువులను గుర్తించారు. వీటి అమ్మకాలను నిలిపివేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా భీమడోలు వ్యవసాయ సహాయ సంచాలకులు పి.ఉషారాజకుమారి, వ్యవసాయాధికారి ఎస్‌పివి.ఉషారాణి తనిఖీ అధికారులకు సహకరించారు.

చింతలపూడి :రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు మాత్రమే సరఫరా చేయాలని వ్యవసాయ కమిషనర్ కార్యాలయం సహాయ సంచాలకులు జగదీశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని ఎరువులు, పురుగుల మందులు, విజిలెన్స్, వ్యవసాయం సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో వరి విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. రైతులకు విధిగా బిల్లులు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ సిఐ చింతలపూడి వ్యవసాయ సంచాలకులు నాగ కుమార్, ఎఒ మీనాకుమారి పాల్గొన్నారు.

'చింతలపూడి' అభివృద్ధికి సహకరించండి

ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంఎల్‌ఎ

చింతలపూడి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్విని కోరారు. శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను ఎంఎల్‌ఎ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చింతలపూడి నియోజకవర్గం సమస్యలపై చర్చించామని ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్ తెలిపారు. చింతలపూడి నియోజకవర్గంలో దెబ్బతిన్న రహదారులు నిర్మించాలని, చింతలపూడి మున్సిపాలిటీలో సెంట్రల్ లైటింగ్‌కు తక్షణం మరమ్మతులు చేయించాలని కోరారు. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు డిమాండ్ ఎక్కువగా ఉన్నందున సీట్లు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు ఈ కార్యక్ర మంలో మాజీ ఎంఎల్‌ఎ ఘంటా మురళీ, నేతలు చలపతిరావు, లక్ష్మణరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

పదవుల కోసం ఫీట్లు.. పట్టని జనం కష్టాలు..!

ఎన్నికల ఫలితాలు వచ్చి నెల రోజులు దాటింది. ప్రజాప్రతినిధులు జనం సమస్యల అధ్యయనంలో బిజీబిజీగా పర్యటనలు సాగిస్తున్నారు. ఇక అధికారులు బదిలీల కోసం ఎదురుచూస్తూనే కొత్త ప్రజాప్రతినిధుల ఆలోచనల మేరకు పనులకు ప్రతిపాదనల తయారీలో నిమగ్నమయ్యారు. అదే సమయంలో గ్రామ, మండల, నియోజకవర్గస్థాయి టిడిపి, జనసేన, బిజెపి నేతలు మాత్రం నామినేటెడ్ పదవుల కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇదే సమయంలో ఎంఎల్‌ఎలుగా ఎన్నికైన వారు సైతం తమ హోదా మరింత పెంచుకునే ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం. నరసాపురం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్‌కు విప్ హోదా కల్పించాలని సిఎం చంద్రబాబుకు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ లేఖ రాసిన సంగతి తెలిసిందే. దీంతో నాయకర్‌కు విప్ పదవి కట్టబెడుతూ అధికారిక ప్రకటన రావడమే తరువాయి. ఉండి ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజుకు కూడా ఏదోక పదవి కట్టబెట్టి సముచిత స్థానం కల్పిస్తారనే ప్రచారం సాగుతోంది. ఆచంట ఎంఎల్‌ఎ, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ సీనియర్లు కావడంతో చంద్రబాబు కచ్చితంగా కొంత ప్రాధాన్యత దక్కే రీతిలో చర్యలు చేపడతారనే ప్రచారం సాగుతోంది. ఇదిలా ఉండగా రాష్ట్ర, జిల్లాస్థాయి నామినేటెడ్ పదవుల కోసం నియోజకవర్గ, మండలస్థాయి నేతలు పైరవీలు ప్రారంభించారు. జనసేన ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో టిక్కెట్ ఆశించి భంగపడ్డ టిడిపి నేతలు ప్రస్తుతం రాష్ట్ర లేదా జిల్లాస్థాయి నామినేటెడ్ పదవుల కోసం జిల్లా మంత్రులతోపాటు లోకేష్‌ను ప్రత్యేకంగా కలుస్తున్నారు. అదే సమయంలో జనసేన



తరపున టిక్కెట్ ఆశించి భంగపడిన సీనియర్ నేతలు సైతం నామినేటెడ్ పదవుల కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఆయా నియోజకవర్గాల్లో టిడిపి ఎంఎల్‌ఎలతో వైరం లేకుండా చూసుకుంటూనే తమ అధినేతను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఇక బిజెపి నేతలు కొందరు మాత్రం దేవాలయ కమిటీల్లో అత్యధికం తమకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరుతున్నట్లు ప్రచారం సాగుతోంది. మొత్తంగా నియోజకవర్గ, మండల స్థాయి నేతలు నామినేటెడ్ పదవుల కోసం చేస్తున్న ప్రయత్నాలు కూటమిలోని పార్టీల మధ్య కొన్నిచోట్ల ఆధిపత్య పోరుకు కారణమవుతుందనే చర్చ సాగుతోంది. ఇదిలా ఉండగా గ్రామస్థాయిలో నేతలు మాత్రం పదవులు రాకుండానే అధికారపక్షం మేమేనంటూ స్థానికంగా ఉండే అంగన్వాడీలు, పాఠశాలలు, సచివాలయాలుపై ఆధిపత్యానికి గట్టిప్రయత్నం చేస్తున్నారు. ప్రధానంగా స్కీమ్‌వర్కర్లు తాము చెప్పింది చేయాలంటూ ఒత్తిడి తీసుకొస్తూ లేనిపక్షంలో తమ వారిని నియమించుకుంటామని బహిరంగంగా చేస్తున్న వ్యాఖ్యలు గత వైసిపి ప్రభుత్వ నేతల తీరును తలపిస్తున్నాయనే విమర్శలు విన్పిస్తున్నాయి. అదే కొనసాగితే వైసిపి ప్రభుత్వ దుస్థితే రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వానికి తప్పదని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు. ఏదేమైనా నామినేటెడ్ పదవుల కోసం నేతల ఫీట్లు ఎలాగున్నా జనం ప్రధానంగా ఎదుర్కొంటున్న ధరలు, ఉపాధి, రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం వంటి సమస్యలపై దృష్టి సారించి పరిష్కారానికి కృషి చేయాలని అంతా కోరుతున్నారు.

-విఎస్‌ఎస్‌వి.ప్రసాద్

పిహెచ్‌సి వైద్యాధికారికి రిలీవ్ నోటీసులు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లి పిహెచ్‌సి వైద్యాధికారి-2 సయ్యద్ హదిద్ యుఆర్ రెహమన్‌ను డైరెక్టర్ ఆఫ్ హెల్త్ విజయవాడకు అటాచ్ చేస్తూ నోటీసులు వచ్చినట్లు వైద్యాధికారి బి.గాయత్రి తెలిపారు. విధులకు సరిగ్గా రాకపోవడం, వచ్చినా విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, సిబ్బంది, రోగుల పట్ల దురుసు ప్రవర్తన, సిసిఎ రూల్స్‌ను అతిక్రమించడం పట్ల జిల్లా వైద్యశాఖాధికారులు నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. నోటీసులు ఇచ్చి మూడు రోజులు కావస్తున్నా వాటికి సమాధానం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. దీనిపై జిల్లా వైద్యశాఖ అధికారి ఆగ్రహం వ్యక్తం చేస్తూ(డిహెచ్) డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ విజయవాడకు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆమె తెలిపారు. రిలీవ్ ఉత్తర్వులు ఇవ్వడానికి వెళ్లిన సిబ్బందిని కూడా బెదిరించి ఆసుపత్రి నుంచి పరారైనట్లు ఆమె తెలిపారు.

సొసైటీలో అవకతవకలపై విచారణ

ప్రజాశక్తి - టి.నరసాపురం

స్థానిక సహకార సంఘం సభ్యుల నుంచి విచారణ అధికారి అల్లంశెట్టి శాంత కుమారి వినతులు స్వీకరించారు. సంఘంలో నలుగురు ఉద్యోగులు అవకతవకలకు పాల్పడ్డారనే అభియోగంపై డిసిసిబికి అందిన ఫిర్యాదుపై ఉన్నతాధికారుల ఆదేశాలతో శనివారం విచారణ అధికారి అల్లంశెట్టి శాంతకుమారి విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడకు చేరుకున్న బాధిత రైతులు, డిపాజిట్‌దారులు సహకార సంఘంలో తమకు జరిగిన అన్యాయంపై ఆమెకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు.

చెరువులను ఆక్వా జోన్‌లోకి తీసుకురావాలి

నిడమర్రు సర్వసభ్య సమావేశంలో ఎంఎల్‌ఎ ధర్మరాజు

ప్రజాశక్తి - నిడమర్రు

మండలంలో ఆక్వాపై ప్రత్యేక దృష్టి సారించి అన్ని చెరువులను ఆక్వా జోన్‌లోకి తీసుకురావాలని ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. నిడమర్రు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వివిధ శాఖలపై సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ అర్హులందరికీ విద్యుత్ రాయితీ వచ్చేవిధంగా కృషి చేయాలన్నారు. వర్షాకాలంలో వర్షపు నీరు నిల్వతో ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉంటుందన్నారు. నీరు నిల్వ లేకుండా డ్రెయిన్లలో పూడిక ఎప్పటికప్పుడు తీయాలని, డ్రెయిన్ లేని చోట కట్టా డ్రెయిన్లు తీయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. ఉపాధి హామీ చట్టం మండల సామాజిక తనిఖీ ప్రజావేదిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం నిర్వహించారు. మండలంలో గతేడాది జరిగిన పనుల్లో భాగంగా వేతనాలు తదితర అంశాలపై అధికారులు సోషల్ ఆడిట్ చేసి డిఆర్‌పిలు, నివేదికలు సమర్పించారు. అనంతరం పీడీ రాము మాట్లాడుతూ సామాజిక తనిఖీ ప్రజావేదికలో క్షేత్రస్థాయి సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

యువకుని రక్తదానం

ప్రజాశక్తి - భీమడోలు

చికిత్స పొందుతున్న రోగికి అవసరమైన రక్తాన్ని అందించడం గుండుగొలను గ్రామానికి చెందిన యువకుడిని పలువురు అభినందించారు. ఏలూరు ఆశ్రం వైద్యశాలలో చికిత్స పొందుతున్న పూళ్ల గ్రామానికి చెందిన మహిళా రోగికి శస్త్రచికిత్స నిమిత్తం అత్యవసరంగా రక్తం అవసరమైంది. ఈ విషయాన్ని గుండుగొలను చెందిన సామాజిక కార్యకర్త సుమన్ బాబు ద్వారా తెలుసుకున్న దిలీప్‌కుమార్ తన పుట్టినరోజు నేపథ్యంలో రోగికి రక్తాన్ని అందించేందుకు ఏలూరు ఆశ్రం వైద్యశాలకు వెళ్లి రక్తదానం చేశారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో అత్యున్నత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శనివారం కళాశాల ప్రిన్సిపల్ సజని ఆధ్వర్యంలో ప్రోత్సాహక నగదు బహుమతులను అందించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం ప్రతి ఏటా నగదు బహుమతి స్పాన్సర్ చేస్తున్న తరపట్ల వెంకటేశ్వరరావు, సజని ఉమామహేశ్వరరావు దంపతులు విద్యార్థులకు ప్రోత్సాహక నగదు స్వయంగా అందించారు. ప్రథమ స్థానంలో ఉత్తీర్ణులైన పి.మానస, ఎ.నిర్మలకుమారిలకు రూ.ఎనిమిది వేలు, ద్వితీయ స్థానంలో ఉత్తీర్ణులైన జి.పావనికి రూ.ఆరు వేలు అందించారు.

మద్ది ఆంజనేయ సన్నిధిలో బొలిశెట్టి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

మండలంలోని గురవాయిగూడెం గ్రామంలో ఉన్న మద్ది ఆంజనేయస్వామి తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ శనివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు స్వామి వారి శేష వస్త్రములతో సత్కరించి, చిత్రపటం, ప్రసాదాలు అందించారు.

జాబ్‌మేళాకు 250 మంది హాజరు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

నగరంలో జులై 16వ తేదీన అగ్ని వీర్ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సైన్యంలో చేరేందుకు యువతకు ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు యువజన సర్వీసు శాఖ ఎంప్లాయిమెంట్ అధికారి మధుభూషణరావు తెలిపారు. యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో శనివారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాలో 250 మంది యువత హాజరయ్యారు. మొత్తం ఏడు కంపెనీలకు సంబంధించి ఉద్యోగాల కల్పనకు యువతకు అవకాశం కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా మధుభూషణరావు మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన నిమిత్తం జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. మొత్తం ఏడు కంపెనీలైన సుజుకి, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్, బజాజ్ క్యాపిటల్, రెడ్డి అండ్ రెడ్డి తదితర కంపెనీలు మొత్తం 200 ఉద్యోగాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. జాబ్‌మేళాకు వచ్చిన యువతలో అర్హులందరికీ ప్లేస్‌మెంట్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

నేరాలు - ఘోరాలు

దాడిలో గాయపడిన మహిళ మృతి

చిగురుకోటలో పోలీస్ పికెట్

ప్రజాశక్తి - ముదినేపల్లి

దాడిలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళ పరిస్థితి విషమించి మృతి చెందింది. ఎస్‌ఐ డి.వెంకట్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిగురుకోటలో ఈ నెల మూడో తేదీ బుధవారం ఉదయం ఎనిమిది గంటలకు సరిహద్దు విషయం, అలాగే ఇంట్లో వాడిన మురుగునీరు దారిలోకి వస్తున్నాయంటూ వరుసకు అన్నదమ్ములైన అన్న పరసా బాలాజీ అతని భార్య దేవి, తమ్ముడు తుమ్మ సురేష్ అతని భార్య అనితలు గొడవ పడగా తమ్ముడు సురేష్ కత్తితో అతని భార్య అనిత చాకుతో పరసా బాలాజీ అతని భార్య దేవిలపై దాడి చేసి గాయపరచిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన బాలాజీ, దేవి గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స అనంతరం భార్యభర్తలు గుడివాడలోని విజయ్‌సాయి ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే దేవి పరిస్థితి విషమంగా మారడంతో మరోసారి ఆమెను విజయవాడ రిఫర్ చేశారు. శుక్రవారం సాయంత్రం దేవిని చికిత్స నిమిత్తం విజయవాడ తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కైకలూరు రూరల్ సిఐ బి.కృష్ణకుమార్ హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తులో భాగంగా ఎస్‌ఐ వెంకటకుమార్‌తో కలిసి సిఐ చిగురుకోట గ్రామం వెళ్లి సాక్షులను విచారించి గుడివాడ ప్రభుత్వాసుపత్రిలో మృతదేహానికి పంచనామా నిర్వహించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. చిగురుకోట గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రశాంత వాతావరణం తీసుకురావడానికి పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు.

డిప్యూటీ తహశీల్దార్‌పై యువకుడి దాడి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు డిప్యూటీ తహశీల్దార్ విద్యాసాగర్‌పై శనివారం ఒక యువకుడు కత్తితో దాడి చేశాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. అమీనాపేటలో ఉన్న సెయింట్ ఫాల్స్ లూథరన్ చర్చిలో మెంబర్‌గా ఉన్నానని, చర్చి విషయంలో ఆర్థిక దుర్వినియోగాన్ని అడ్డుకుంటున్నానని తనపై వేళంగి సునీల్ అనే వ్యక్తి తనపై కత్తితో దాడి చేశాడని చెప్పారు. అతనిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పోలీసు వారిని కోరుతున్నానన్నారు. పోలీసులు ఎంఎల్‌సి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

చింతలపూడి :రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్ర గాయాలపాలైన ఘటన చింతలపూడిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక సాయిబాబా ఆలయం సమీపంలో ద్విచక్ర వాహనాన్ని వ్యాన్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు సమ్మెటివారిగూడెం గ్రామానికి చెందిన పల్నాటి వెంకటనాగ సత్యనారాయణ గాయాపాలయ్యాడు. అతడిని స్థానికులు చింతలపూడి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అక్కడి నుంచి ఏలూరు తరలించారు.

లభ్యం కాని యువతి ఆచూకీ

ఉంగుటూరు :ఏలూరు కాలువలో ఈ నెల రెండో తేదీన గల్లంతైన యువతి ఆచూకీ ఐదు రోజులైనా లభ్యం కాలేదు. భీమవరానికి చెందిన పెచ్చెట్టి ఝాన్సీ చిన్నతనంలో తల్లిదండ్రులను కోల్పోయి ఒంటరిగా ఉంటోంది. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన యువతి ఈ నెల రెండో తేదీన నారాయణపురం వద్ద ఏలూరు కాలువలో దూకింది. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ దొరకలేదని ఎస్‌ఐ మణికుమార్ చెప్పారు. గాలింపు చర్యలను నిడమర్రు సిఐ సుభాష్ పర్యవేక్షించారు.

పిహెచ్‌సి ఉద్యోగి తీరుపై విమర్శలు వెల్లువ..!

వైద్యురాలికి వ్యక్తిగత డ్రైవర్‌గా మారాడని గుసగుసలు!

వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని వేడుకోలు

ప్రజాశక్తి - మండవల్లి

గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలందించాల్సిన ఎంపిహెచ్‌ఎం (మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ మేల్) వైద్యురాలికి వ్యక్తిగత డ్రైవరుగా మారాడని మండవల్లి ప్రజలు విమర్శిస్తున్నారు. వైద్యం అందడం లేదని వైద్యురాలిపై అర్జీ పెట్టిన వారి ఇళ్లకు వెళ్లి వారిని బెదిరిస్తూ అర్జీ ఉపసంహరించుకోవాలని దౌర్జన్యానికి దిగుతున్నట్లు సమాచారం. రోగులు బాధితులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన మేల్ వర్కర్ మూడు సచివాలయాల పరిధిలోని గ్రామాల్లోని ప్రజలు అనారోగ్యాల బారిన పడకుండా అవగాహన కల్పించడంతో పాటు జ్వర పీడితులను గుర్తించి రక్త నమూనాలను సేకరించడం, పారిశుధ్య నిర్వహణతో పాటు డ్రైడే తప్పనిసరిగా నిర్వహించాలి. గతంలో వైద్యం అందించడంలో వైద్యురాలిలో నెలకొన్న నిర్లక్ష్యంపై రోగులు, బాధితులు జిల్లా వైద్యాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై నాలుగుసార్లు విచారించినప్పటికీ గత ప్రభుత్వంలోని రాజకీయ నాయకుల అండదండలు, మామూళ్ల మత్తులో ఉన్న జిల్లా అధికారులు ఆమెపై చర్యలు తీసుకోలేదని విమర్శలు ఉన్నాయి. వైద్యురాలి పలుకుబడి చూసి ఆ మేల్ వర్కర్ ఆమెకు భక్తుడైపోయాడని ప్రజలు విమర్శిస్తున్నారు. ఆమెను ఇంటి వద్ద నుంచి వైద్యశాలకు తీసుకొచ్చి, తీసుకెళ్తూ వైద్యశాలలోనే ఉంటున్నాడనే విమర్శలున్నాయి. సిబ్బందితోపాటు మరెవరైనా వైద్యురాలిని కలవాలంటే మెయిల్ వర్కర్ అనుమతులు తీసుకోవాల్సిందేనని చెబుతున్నారు. వైద్యురాలు ఇచ్చిన చనువు, అండదండలతో సిబ్బందిపై దౌర్జన్యానికి దిగుతూ వేధింపులకు పాల్పడుతున్నట్లు సమాచారం. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి, విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై జిల్లా వైద్యాధికారి శర్మిష్టను వివరణ కోరగా తప్పు ఎవరూ చేసినా తప్పేనని, పరిశీలించి వారిపై చర్యలు తీసుకుంటానని తెలిపారు.

సమస్యలు పరిష్కరించని గ్రామసభలెందుకు?

సర్పంచి, కార్యదర్శిని నిలదీసిన మండవల్లి వాసులు

ప్రజాశక్తి - మండవల్లి

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించలేనప్పుడు గ్రామ సభలు నిర్వహించి ప్రజల అమూల్యమైన సమయాన్ని ఎందుకు వృథా చేస్తారంటూ సర్పంచి కార్యదర్శితో పాటు ప్రజాప్రతినిధులను గ్రామస్తులు నిలదీశారు. మండల కేంద్రమైన మండవల్లి గ్రామసభ సర్పంచి మెండ ఝాన్సీ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ గ్రామసభలో గ్రామస్తులు సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. తాగునీరు, డ్రెయినేజీ, ఇళ్ల స్థలాలు, వైద్యం, పారిశుధ్యం తదితర అంశాలపై నెలకొన్న సమస్యలపై నూతన ప్రభుత్వానికి చెందిన ప్రజా ప్రతినిధుల సమక్షంలో సర్పంచిని కార్యదర్శిని ప్రశ్నించారు. జల జీవన్ మిషన్ ద్వారా రూపాయికి కులాయి కనెక్షన్ ఇవ్వాల్సి ఉన్నప్పటికీ ఇవ్వకపోవడంపై, గుట్టు చప్పుడు కాకుండా నిబంధనలను విరుద్ధంగా కుళాయి కనెక్షన్ ఇచ్చేసి రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్న విధానంపై గ్రామస్తులు సర్పంచిని, కార్యదర్శిని ప్రశ్నించారు. పంచాయతీ స్థలాలను ఆక్రమించి సొమ్ము చేసుకుంటున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. రూ.లక్షలు వెచ్చించి ఫిల్టర్ బెడ్లను మరమ్మతులు చేయించి కలుషిత నీటిని ఎందుకు సరఫరా చేస్తున్నారని నిలదీశారు. పిహెచ్‌సిలో వైద్యులు అందుబాటులో ఉండటం లేదని, వైద్యం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వ్యాధులు ప్రబలకుండా ఎటువంటి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. కార్యదర్శి, ప్రజాప్రతినిధులు గ్రామస్తులకు సర్ది చెప్పేందుకు ప్రయత్నించగా గత మూడున్నరేళ్ల నుంచి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎన్నిటిని పరిష్కరించారో చెప్పాలన్నారు. గ్రామసభలో సమస్యలు పరిష్కారం కాకపోవడంతో తాము సభకు రావడంలేదని, సమస్యలు పరిష్కరించలేనప్పుడు గ్రామ సభలు నిర్వహించడం ఎందుకని ప్రశ్నిస్తూ ప్రజలు సభ నుంచి వెళ్లిపోయారు. అనంతరం సభను ముగించి వేశారు. ఈ గ్రామసభలో ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, గ్రామ ప్రముఖులు, మాజీ సర్పంచి గుడివాడ చిట్టిబాబు, వెటర్నరీ ఎడి వరప్రసాద్, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కర్‌రావు, టెంటు అప్పారావు, బండి రంగారావు, గ్రామస్థాయి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



సర్పంచి, కార్యదర్శిని నిలదీస్తున్న గ్రామస్తులు

బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయాలను కొనసాగించాలి

వర్ధంతి కార్యక్రమంలో వక్తలు

ప్రజాశక్తి - చింతలపూడి

బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా లింగపాలెం మండలంలోని ధర్మాజీగూడెం గ్రామంలో ఆయన విగ్రహానికి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి కుటుంబసభ్యులు, కార్యకర్తలు, అభిమానులు, దళిత నాయకులు పాల్గొన్నారు.

కామవరపుకోట : మండలంలోని తాడిచర్లలో బాబూ జగ్జీవన్‌రామ్ 38వ వర్ధంతిని టిడిపి నేతలు నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ విగ్రహానికి టిడిపి నేతలు పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంఎల్‌ఎ మురళీ రామకృష్ణ హాజరై మాట్లాడారు. ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు బీహార్‌లోని వెనుకబడిన తరగతుల నుంచి వచ్చిన సంఘ సంస్కర్త, రాజకీయ వేత్త, బాబూజీగా ప్రసిద్ధుడైన బాబు జగ్జీవన్ రామ్ 40 ఏళ్ల పాటు వివిధ మంత్రి పదవులు నిర్వహించడమే కాకుండా ఉప ప్రధానిగా వ్యవహరించారన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించడానికి మనమంతా కృషి చేయాలన్నారు. టిడిపి మండలాధ్యక్షులు కిలారు సత్యనారాయణ, తాడిచర్ల సర్పంచి పసుమర్తి పార్థసారథి, గ్రామ కమిటీ అధ్యక్షుడు వేముల హనుమంతు, కొప్పుల జయరాజు, కుటుంబరావు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : పట్టణంలోని బాపునగర్, అజారయ్యపేటలో ఉన్న బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ టౌన్ అధ్యక్షులు కుమార్ మాదిగ, దుబ్బాకు దేవరాజు మాదిగ, ఎంఎస్‌పి అధ్యక్షులు వెంపటి వెంకటేశ్వరరావు మాదిగ, ఎంఎస్‌పి నూజివీడు మం డలాధ్యక్షులు, అగిరిపల్లి మండల ఇన్‌ఛార్జి కలపాల విలియమ్స్ మాదిగ, ఎంఎస్‌పి ఏలూరు జిల్లా ఉపాధ్యక్షులు ముళ్ల పూడి వెంకటేశ్వరరావు మాదిగ, నూజివీడు పట్టణ టౌన్ ఎస్‌ఐ పి.సురేష్, కొడవటి భాస్కరరావు, టిడిపి 14వ వార్డ్ ప్రెసిడెంట్, బాపూనగర్ యువత, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : స్థానిక ఎస్‌సి కాలనీలో ఉన్న బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి దళితులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యువజన సేవా సంఘం అధ్యక్షుడు బొబ్బర చిట్టిబాబు మాట్లాడుతూ రాజకీ య రంగంలో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు, భారతదేశ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు.

చాట్రాయి : మండలంలోని చనుబండ గ్రామంలో ఏలూరు జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మోదుగు ముత్తయ్య, తల్లాడ శ్రీనివాసరావు, గార్లపాటి మారేష్, విస్సంపల్లి ప్రసాద్, తేనేటి రాజేంద్ర, గద్దల కుటుంబరావు, విస్సంపల్లి రాజా, గొల్లమందల వెంకటేశ్వరరావు, మొద్దు శ్రీను, మిద్దె చెన్నారావు, మోదుగు పెద వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



కామవరపుకోటలో....

గుర్తింపు కార్డులు రెన్యువల్ చేసుకోవాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని కౌలు రైతులందరు తమ గుర్తింపు కార్డులు రెన్యువల్ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.సుమలత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 2700 మంది కౌలు రైతులు తమ గుర్తింపు కార్డులను రెన్యువల్ చేసుకోవాల్సి ఉందని ఆమె తెలిపారు. కొత్తగా నమోదు చేసుకోవాల్సిన కౌలు రైతులు రైతు సేవా కేంద్రాల వద్ద అప్లికేషన్ పొంది స్థానిక విఆర్‌ఒ ద్వారా కౌలు రైతు గుర్తింపు కార్డులు పొందాలని ఆమె తెలిపారు.

ఉపాధ్యాయులకు శక్తి సామర్థ్య అభివృద్ధి శిక్షణ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

సమాజానికి దిశా, నిర్దేశకులు, సమాజంలో అసమానతలు తొలగించి విద్యార్థులను అత్యున్నత వ్యక్తులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని ప్రముఖ సైక్రియాటిస్టు, మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు అన్నారు. మండల పరిధిలోని తోటపల్లిలో హీల్ స్కూల్‌లో ఉపాధ్యాయులకు నిర్వహించిన శక్తి సామర్థ్య అభివృద్ధి శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ పశ్చిమ గోదావరి జిల్లా ఎడ్యుకేషనల్ ఛైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, హీల్ కార్యదర్శి తాతినేని లక్ష్మి, ప్రిన్సిపల్ బి.సాయిబాబు, పాల్గొన్నారు.

వైసిపి కార్యకర్తకు పరామర్శ

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలో సరిపల్లి గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త వెంకటేశ్వరరావును మాజీ ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు శనివారం పరామర్శించారు. వెంకటేశ్వరరావుపై గుర్తు తెలీని వ్యక్తి దాడి చేయగా గాయాలపాలైన ఆయన ఆసు పత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు వైసిపి కార్యకర్త వెంకటేశ్వ రరావును ఇంటికి వెళ్లి పరామర్శించారు.

అవినీతి, అక్రమాలు సాగనివ్వం

పెదవేగి సర్వసభ్య సమావేశంలో దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

వైసిపి పాలనలో వ్యవస్థలు మొత్తం సర్వనాశనం చేశారని దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. శనివారం నిర్వహించిన పెదవేగి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైసిపి పాలనలో దెందులూరు నియోజకవర్గం మొత్తం అస్తవ్యస్తంగా మారిందన్నారు. అక్రమాలకు పాల్పడి ప్రజాధనాన్ని దోపిడి చేసిన ప్రతిఒక్కరిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఒత్తిళ్లకు తలొగ్గి వైసిపి నాయకుల అవినీతి, అక్రమాలకు కొమ్ము కాసిన ప్రభుత్వ ఉద్యోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. అక్రమాలకు పాల్పడిన ప్రతిఒక్కరిపై చర్యలు ఉంటాయని, దోపిడీకి గురైన ప్రజాధనాన్ని తిరిగి రికవరీ చేస్తామని తెలిపారు. గ్రామాల వారీగా వైసిపి నాయకులు చేసిన అవినీతి, అక్రమాలను మీడియా ద్వారా ప్రజల ముందు ఉంచుతామని చెప్పారు. ఈ సమావేశంలో పెదవేగి గ్రామ సర్పంచి తాతా శ్రీరామమూర్తి, ఎంపిడిఒ వెంకటరమణ, డిప్యూటీ తహశీల్దార్ రామారావు పాల్గొన్నారు.

అందరూ విధిగా మొక్కలు నాటాలి

ప్రజాశక్తి - కామవరపుకోట

స్థానిక కామవరపుకోట శివారు ఆడమిల్లిలోని ప్రభుత్వ మోడ్రన్ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎం.మల్లేశ్వరరావు అధ్యక్షతన ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎం.మల్లేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటడంతో పాటు బాధ్యతతో సంరక్షించాలన్నారు. ఎన్ఎస్ఎస్ విభాగం కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి తన మాతృమూర్తి పేరు మీదుగా ఒక మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎం.మల్లేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ విభాగం కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.శ్రీనివాసరావు, ఇతర అధ్యాపకులు జి.రామ్మోహన్, ఎం.ఉషారాణి, కె.ఇందిరా కుమారి, వి.శ్రీనివాస్, ధారావతు మల్లేష్‌లతో పాటు ఆఫీస్ సిబ్బంది అన్నపూర్ణమ్మ, రత్న సిరిలో, కుమార్ రాజా పాల్గొన్నారు.

అచ్చాయమ్మ మృతి తీరని లోటు

ప్రజాశక్తి - కామవరపుకోట

మండలంలోని గుంటుపల్లి గ్రామపంచాయతీలోని కంఠమనేనివారిగూడెంలో టిడిపి నాయకుడు కంఠమనేని వీర్రాజు భార్య అచ్చాయమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కామవరపుకోట మండలాధ్యక్షులు కిలారు సత్యనారాయణ, పలువురు టిడిపి నేతలు అచ్చాయమ్మ చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కిలారు సత్యనారాయణ మాట్లాడుతూ అచ్చాయమ్మ కుటుంబం టిడిపి పట్ల అంకితభావంతో పని చేశారన్నారు. ఆమె మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సంతాపం తెలిపినవారిలో ఎర్ర కాలువ ఎత్తిపోతల సంఘం మాజీ ఛైర్మన్ కంఠమనేని సత్యనారాయణ, గుంటుపల్లి సర్పంచి గోరింక దాసు, టిడిపి కామవరపుకోట టౌన్ ప్రెసిడెంట్ వజీర్ ఖాన్, ఎస్‌సి సెల్ మండలాధ్యక్షుడు కరిపోతు కృష్ణ ఉన్నారు.

పశు సంక్రమిత వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

పలుచోట్ల ప్రపంచ జునోసిస్ దినోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా స్థానిక పెన్షన్ లైన్, వెటర్నరీ హాస్పిటల్‌లో కుక్కలకు ఉచితంగా యాంటీ ర్యాబిలు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి, జిల్లా జాయింట్ డైరెక్టర్ నెహ్రూ బాబు మాట్లాడుతూ ఏలూరు జిల్లాకు 31 వేల ర్యాబిస్ టీకాలు సిద్ధం చేశామని తెలిపారు. దీనికోసం సుమారు రూ.31 లక్షలు ఖర్చు చేశామని తెలిపారు.

జీలుగుమిల్లి :పశు సంక్రమిత వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు తెలిపారు. జీలుగుమిల్లి ప్రాంతీయ పశు వైద్యశాలలో ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు కుక్కలకు యాంటి ర్యాబిస్ నివారణ టీకాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు పెంపుడు కుక్కలకు పశువైద్య సిబ్బందితో కలిసి యాంటీ ర్యాబిస్ టీకాలు వేశారు. ప్రాంతీయ పశువైద్యశాల శిథిలావస్థకు చేరుకోవడంతో వైద్య సిబ్బంది ఆయన దృష్టికి తీసుకురాగా వెంటనే ఐటిడిఎ డిడితో మాట్లాడి నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని కోరారు.

భీమడోలు : పశుసంక్రమిత వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని, అవి సోకకుండా అప్రమత్తతతో మెలగాలని భీమడోలు ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఇకుర్తి సాయిరమేష్ కోరారు. ప్రపంచ జునోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రాంతీయ పశు వైద్యశాల పరిధిలోని ఐదు మండలాలకు చెందిన అన్ని పశు వైద్యశాలల్లో శనివారం ఉచిత ర్యాబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన ఆధ్వర్యంలో సంబంధిత పశువైద్యులు, సిబ్బంది నిర్వహించారు. భీమడోలు ప్రాంతీయ పశు వైద్యశాలలో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.

చింతలపూడి : పశుసంక్రమిత వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తప్పక వ్యాక్సినేషన్ చేయించాలని చింతలపూడి పశు సంవర్ధక శాఖాధికారి లింగయ్య తెలిపారు. ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా ఉచిత యాంటీ ర్యాబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చింతలపూడి మండలంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

మండవల్లి :జంతువుల నుంచి మనుషులకు వ్యాధులు సోకకుండా పెంపుడు జంతువులకు ఎప్పటికప్పుడు వ్యాధి నిరోధక టీకాలను తప్పనిసరిగా వేయిస్తూ ఉండాలని ప్రాంతీయ పశు వైద్య శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ డివి.వరప్రసాద్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో ప్రపంచ జునోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పెంపుడు కుక్క లకు ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలను శనివారం వేశారు.

ఆగిరిపల్లి : పశుపక్ష్యాదుల నుంచి మానవులకు వ్యాధులు సంక్రమించకుండా ఆరికట్టడమే ప్రపంచ జునోసిస్ దినోత్సవ ముఖ్య ఉద్దేశమని ఆగిరిపల్లి పశువైద్యాధికారి సిహెచ్. హనుమంతరావు అన్నారు. ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

'నీట్ పరీక్షలను రద్దు చేయాలి'

ప్రజాశక్తి - పోలవరం

2024 నీట్ పరీక్షలను రద్దు చేయాలని పిడిఎస్‌యు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యక్షులు బన్నె వినోద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఉదయం పోలవరంలో స్థానిక ఏటిగట్టు సెంటర్ వరకూ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ నీట్ 2024 పరీక్షల్లో కొన్ని రాష్ట్రాల్లో లీకేజీలు, అక్రమాలు జరిగాయన్నారు. 67 మంది విద్యార్థులకు నూటికి నూరు శాతం మార్కులు రావడం 24 లక్షల మంది విద్యార్థులను తీవ్ర ఆందోళనకు గురి చేసిందన్నారు. పరీక్షల నిర్వహకులపై పేపర్ లీకేజీలపై సమగ్ర న్యాయ విచారణ చేయాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని, క్వశ్చన్ పేపర్ల లీకేజీలు అరికట్టాలని, నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు షేక్ అమీర్, కొయ్య సంతోష్, కుంజం అమర్నాథ్, గోరా షస్రక్ ఆసిఫ్, మేడు గణేష్, వారా మంజుల, యంగల శిరీష, బచ్చుల రాజేశ్వరి, బిక్కవోలు విజయదుర్గ, వారా సంజన పాల్గొన్నారు.

చినవెంకన్న సేవలో ఎంపీ పురంధేశ్వరి

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమలలో శ్రీవారిని రాజమండ్రి ఎంపీ దగ్గుపాటి పురంధేశ్వరి, గోపాలపురం ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు శనివారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన వారికి ముందుగా దేవస్థానం కార్యనిర్వాహణాధికారి వేంద్ర త్రినాధరావు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు వారికి శ్రీవారి శేషవస్త్రాలను కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలికారు. ఆలయ వంశపారంపర్య ధర్మ కర్తలు ఎస్‌వి.సుధాకరరావు కుమారుడు నివృతరావు చినవెంకన్న జ్ఞాపికలను, ప్రసాదాలను అందించారు.

కమల్‌హాసన్ చిత్రపటానికి పాలాభిషేకం

ఏలూరు సిటీ :ఈ నెల 12వ తేదీన భారతీయుడు-2 సినిమా రిలీజ్ సందర్భంగా కమల్ హాసన్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని సాయిబాలాజీ థియేటర్‌లో శనివారం హంగామా చేశారు. ఈ సందర్భంగా అభిమానులు థియేటర్‌లోని కమల్‌హాసన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కమల్‌హాసన్ ఫ్యాన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మల్లిపూడి రాజా మాట్లాడుతూ దేశంలో ఉత్తమ నటుడిగా పేరుపొందిన నటుడు కమల్ హాసన్ అని కీర్తించారు. మొదటి చిత్రంతోనే ఉత్తమ అవార్డు పొందారన్నారు. భారతీయుడు సినిమా శంకర్ డైరెక్షన్‌లో ఈ నెల 12వ తేదీన దేశవ్యాప్తంగా రిలీజ్ అవుతుందని, ఈ సినిమా అఖండ విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాఘవ, సురేష్ ఫిలిమ్స్ డిస్ట్రిబ్యూటర్ వి.నాగార్జునరావు, మేడిచర్ల శ్యామ్ కుమార్, ఉషా పిక్చర్స్ డిస్ట్రిబ్యూటర్ సురేష్ పాల్గొన్నారు.